క్లుప్తంగా

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని నులకపేట 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం విద్యుత్‌శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఈ షణ్ముఖ మాట్లాడుతూ 6 నెలలకు ఒకసారి సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 25 మంది సిబ్బంది పాల్గొన్నారని, మరమ్మతుల అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు ఆయన తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌పై నిరసన



తాడేపల్లిరూరల్: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై నిరసన కార్యాక్రమాన్ని రైతు సంఘం నాయకులు శనివారం ఉండవల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతుల నడ్డివిరిచే విధంగా ఉందని, రైతాంగానికి గత ఏడాది కన్నా బడ్జెట్ తగ్గించారని, దీని ప్రభావం వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల మొత్తాన్ని వర్తిస్తుందని ఆయన అన్నారు. తెలంగాణలో ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీని ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం బడ్జెట్ ప్రతులను దగ్ధం చేశారు. రైతు సంఘం అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, ఉండవల్లి గ్రామ ఉపాధ్యక్షుడు పి. వీరాస్వామి, రైతు సంఘం సభ్యులు బక్కిరెడ్డి కాశిరెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని గుండిమెడలో విద్యుత్ లోఓల్టేజ్ సమస్యలను పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు శనివారం నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇటీవల గుండిమెడ ప్రాంతానికి చెందిన వారు లో ఓల్టేజ్ సమస్య ఉందని, దీని కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రం అందజేయడంతో ఆయన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో రూ.9లక్షల వ్యయంతో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గుండిమెడలోని ఎస్సీ కాలనీ, సాయిబాబా గుడి ప్రాంతం, పంచాయతీ కార్యాలయం, బరియల్ గ్రౌండ్ ప్రాంతాల్లో లో ఓల్టేజ్ సమస్యలు పరిష్కారమవుతాయని విద్యుత్ ఏఈ లక్ష్మీనారాయణ తెలిపారు.

వాహనాల తనిఖీ



మంగళగిరి: వాహనచోదకులు హెల్మెట్ ధరించడంతో పాటు, తప్పకుండా నిబంధనలు పాటించాలని పోలీసు అధికారులు సూచించారు. శనివారం సాయంత్రం నార్త్ జోన్ పరిధిలోని పలు కూడళ్లలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహనాలు తనిఖీలు చేసి విజిబుల్ పోలీసింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వాహనాలు తనిఖీలు నిర్వహించి ట్రాఫిక్ నిబంధలను వివరించారు. ఆయా తనిఖీలలో పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు టీడీ వ్యాక్సిన్



మంగళగిరి: పట్టణంలోని వీవర్స్ కాలనీ ఎంటీఎంసీ స్కూలులో శనివారం విద్యార్థులకు టీడీ వ్యాక్సిన్ పంపిణీ చేశారు. గణపతి నగర్ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో వేశారు. అర్బన్ హెల్త్ సెంటర్ పి.అనూష మాట్లాడుతూ 10 నుంచి 16 సంవత్సారాల పిల్లలకు టీడీ వ్యాక్సిన్ వేస్తామన్నారు. పిల్లలకు టెటానస్, డిఫ్తీరియా వ్యాధులు సోకకుండా టీడీ వ్యాక్సిన్ నివారిస్తుందన్నారు. పిల్లలు ఆటలాడుకునే సమయంలో తగిలే దెబ్బల వలన ఇన్‌ఫెక్షన్ చేరి టెటానిస్ వ్యాధికి గురవతారన్నారు. డిఫ్తీరియా ఒకరి నుంచి మరొకరికి సోకుతుందన్నారు. తల్లిదండ్రులు వ్యాధులు సోకకుండా పిల్లలందరికి టీడీ వ్యాక్సిన్ వేయించాలన్నారు.

వైఎస్ జగన్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి

మాజీ మంత్రి డొక్కా

తాడికొండ: ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

టిడ్కో వాసుల ఇక్కట్లు తీర్చరూ!

- టిడ్కో ఇళ్లకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పనకు మాజీ ఎమ్మెల్యే ఆర్కే కృషి
- రూ 1.10 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం
- రూ 7.20 కోట్లతో ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి
- నేటికీ ప్రారంభించని టీడీపీ ప్రభుత్వం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న టిడ్కో వాసులు



పూర్తయిన ఇండోర్ సబ్ స్టేషన్



నిర్మాణం పూర్తయి, ప్రారంభానికి నోచుకోని ఓవర్ హెడ్ ట్యాంక్

మంగళగిరి: టీడీపీ నేతల తీరుతో పట్టణంలోని ఆటోనగర్ టిడ్కో ఇళ్ల నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2024 ఎన్నికలకు ముందు టిడ్కో నివాసితులకు తాగునీరు విద్యుత్ సౌకర్యాలకు శాశ్వత పరిష్కారం చేయాలనే లక్ష్యంతో మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవ తీసుకుని అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి రూ1.10 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంక్, రూ.7.20 కోట్లతో విద్యుత్ ఇండోర్ సబ్‌స్టేషన్ పనులు ప్రారంభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభానికి నోచుకోలేదు. అయితే ఎన్నికలు ముగిసి రెండు నెలలు సమీపిస్తున్నా టీడీపీ ప్రభుత్వం వాటిని ప్రారంభించడానికి మీనమేషాలు లెక్కిస్తుండడంతో టిడ్కో వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రారంభిస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి క్రెడిట్ వెళుతుందని, కాబట్టి కొద్ది నెలలు ఆగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు అధికారులకు సూచించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే తాగునీరు, విద్యుత్ సమస్యలతో టిడ్కోవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరంతా సంఘంగా ఏర్పడి టీడీపీ నాయకులు, అధికారులను కలిసి ఆయా పథకాలను ప్రారంభించి, తమ కష్టాలు తీర్చాలని వేడుకున్నా.. స్థానిక నాయకులు, అధికారుల నుంచి ఎలాంటి సమాధా నం రావడం లేదని సంఘాల ప్రతినిధులు వాపోతున్నారు. మంత్రి నారా లోకేష్ స్పందించి ఇండోర్ సబ్ స్టేషన్, ఓవర్‌హెడ్ ట్యాంకులను ప్రారంభింపజేసి, తమ కష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

స్ఫూర్తిప్రదాత అబ్దుల్ కలాం

దుగ్గిరాలలో అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం



అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న షేక్ సుభాని, తదితరులు

తాడేపల్లిరూరల్: భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి అని యువతలో గొప్ప స్ఫూర్తిని అబ్దుల్ కలాం రగిలించారని, యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని తన చివరి క్షణం వరకు నమ్మి, యువతకు స్ఫూర్తిదాయకుడిగా నిలిచారన్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించి, పేపర్‌బోయ్ స్థాయి నుంచి మిసైల్ మ్యాన్‌గా, దేశ అత్యున్నత పదవైన రాష్ట్రపతి పదవిని అధిరోహించి దేశానికి ఎనలేని సేవలందించారని అన్నారు. యువత అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ రషీద్, షేక్ హుస్సేన్, షేక్ జాన్ సైదా, షేక్ సలీమ్, ఖాదర్ బేగ్, షేక్ జిలాని, షేక్ బాజీ, మహబూబ్ సుభాని, షేక్ మస్తాన్, షేక్ బుడే, కాకా వెంకటేశ్వర్లు, మునిపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అబ్దుల్ కలాం

తాడికొండ: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని తాడికొండలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ బండ్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ధనేకుల హరిబాబు, పున్నయ్య, చింతల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కరెంటు తీగలు తగిలి మూడు గేదెలు మృతి



మృతి చెందిన గేదెలు

పెదకాకాని: విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యానికి మూడు గేదెలు బలైన సంఘటన కొప్పురావూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శాఖమూరి సాంబయ్య, శ్రీను శనివారం గ్రామ శివారు ప్రాంతానికి పశువుల్ని మేతకు తోలుకెళ్లారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మేత బాగా పెరిగి ఉండటంతో పాటు అదే ప్రదేశంలోకరెంటు తీగలు తెగి పడి ఉన్నాయి. ఉదయం కరెంటు తీగలు తెగి పడితే మధ్యాహ్నం వరకూ కూడా సిబ్బంది అటువైపు కూడా తిరిగి చూడలేదు. కనీసం సరఫరా కూడా నిలుపుదల చేయలేదు. మేత మేస్తున్న గేదెలు కరెంటు తీగలు తగిలి సంఘటనా ప్రదేశంలో యజమానుల ముందే విలవిల కొట్టుకుంటూ కన్నుమూశాయి. వాటి విలువ రూ. 2 లక్షల దాకా ఉంటుందని, విద్యుత్ శాఖ నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.

కరుణామయి పాలక పునీత అన్నాంబ



కేక్ కట్‌చేస్తున్న మఠకన్యా స్త్రీలు, విచారణ గురువులు

ఫిరంగిపురం: కరుణామయి పునీత అన్నాంబ అని బాల ఏసుదేవాలయ విచారణ గురువులు ఎం.ఫాతిమా మర్రెడ్డి అన్నారు. మరియ మాత తల్లి పాలక పునీత అన్నాంబ పుట్టినరోజు వేడుకలు మండలకేంద్రంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా దివ్యపూజాబలి నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మార్నింగ్‌స్టార్ కళాశాల కరస్పాండెంట్ మద్దు బాలస్వామి వాక్యోపదేశం చేశారు. పునీత అన్నాంబ వలే ప్రతి ఒక్కరూ సహనం, శాంతం, ఓర్పు, క్షమాగుణం కలిగి ప్రార్థనలతో జీవించాలని చెప్పారు. అనంతరం సెయింట్‌ఆన్స్ ఇంగ్లిష్ మీడియం విద్యార్థులచే పునీత అన్నాంబకు మరియమాత జననం గురించి తెలియజేస్తున్న నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ స్కూల్స్ కో–ఆర్డినేటర్ సిస్టర్ డాక్టర్ ఫాతిమా రాణి, సుపీరియర్ సిస్టర్ డాక్టర్ ఏరువ విన్సీపాల్, సెయింట్‌ఆన్స్ తెలుగు, ఇంగ్లీషు మీడియం పాఠశాలల హెచ్‌ఎంలు నిర్మలామేరి, ఒ.థెరీసమ్మ, సిస్టర్ సునీల, ఫాదర్ విలియమ్స్, ఉపాధ్యాయులు, మఠకన్యాస్త్రీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మనోవికాసానికి వర్క్‌షాపులు దోహదం



గుంటూరు రూరల్: వర్క్‌షాపులు, శిక్షణలు విద్యార్థుల్లో సృజనాత్మకత, మనోవికాసానికి ఎంతో దోహదపడతాయని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ టి. శేఖర్ తెలిపారు. నల్లపాడులోని కళాశాలలో శనివారం లైఫ్ ఫర్ యంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లైఫ్‌స్కిల్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, కృషితోనే ఉన్నత శిఖరాల్ని చేరతారని తెలిపారు. లైఫ్ స్కిల్స్ కోచ్ ఆచార్య రమణేశ్వర్ మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు సాంకేతిక విద్యతోపాటు సమాంతరంగా జీవన నైపుణ్యాల్ని మెరుగు పరుచుకోవాలని సూచించారు. కుటుంబ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా లైఫ్ స్కిల్స్ కార్యక్రమాలు వచ్చి చేరాయని తెలిపారు. ఫౌండేషన్ సీఈవో ఎ. భానుప్రకాష్ మాట్లాడుతూ లైఫ్ స్కిల్స్‌కి సమాజంలో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందని చెప్పారు. రాబోయే రోజుల్లో జిల్లాలోని అన్ని కళాశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుళ్లూరు పీఎస్ ఎదుట గేదెల యజమానుల ఆందోళన

6 నెలలుగా 500 గేదెలు అపహరణకు గురైనా చర్యలు శూన్యమని ఆవేదన



తుళ్లూరు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న గేదెల యజమానులు

తాడికొండ: తుళ్ళూరు మండలంలో ఇటీవల కాలంలో గేదెల దొంగతనాలు పెరిగిపోయాయని, చర్యలు తీసుకోవాల్సిన పోలీసు శాఖ పట్టించుకోవడం లేదని పలు గ్రామాలకు చెందిన గేదెల యజమానులు తుళ్లూరు పోలీస్‌స్టేషన్ ఎదుట శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. వెంకటపాలెం, మందడం, ఐనవోలు, అనంతవరం, రాయపూడి, శాఖమూరు, పలు గ్రామాలకు చెందిన 70 మంది గేదెల యజమానులు తమకు న్యాయం చేయాలంటూ నిరసన తెలియజేశారు. గత 5 నెలలుగా మండల పరిధిలో సుమారు 500 గేదెలు అపహరణకు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. తాము పేదలమని, రాజధాని నిర్మాణానికి వ్యవసాయ భూములు ఇవ్వడంతో కూలి పనులు లేక గేదెలు మేపుకొంటూ జీవనం సాగిస్తున్నామని, ఒక్కొక్కటి రూ.లక్ష విలువ చేసే గేదెలు దొంగిలిస్తుంటే తమ జీవనం ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. గేదెలను దొంగతనంగా ఆటోల్లో ఎక్కించి తరలిస్తున్న కొంతమందిని పట్టుకొని గతంలో పోలీసులకు అప్పగిస్తే వారిని విడిచిపెట్టారని మండిపడ్డారు. తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో బాధితులంతా కలిసి ధర్నా చేస్తామని అన్నారు. ఈ నిరసనలో పలు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

లార్వాలను నిర్వీర్యం చేసే గంబూషియా చేపలు

జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం



నీటి కుంటలో చేపలు వదులుతున్న మురళీకృష్ణ సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: గంబూషియా చేపలను చెరువులు, నీటి కుంటలలో వదలడం వలన అవి దోమల లార్వాను నిర్వీర్యం చేస్తాయని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. హట్కో కాలనీలోని నీటి కుంటల్లో శనివారం గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంటల్లో నీరు నిల్వ ఉండటం వలన దోమల వ్యాప్తి ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. దానిని నియంత్రించేందుకు ఇవి ఎంతో దోహద పడతాయన్నారు. నీటి నిల్వల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యశాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి రాజునాయక్, శివగణేష్, తెనాలి సహాయ అధికారి చెరసాని ప్రభాకర్‌రెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, పట్టణ, మండల సబ్‌యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగాల పున్నారెడ్డి, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు గుద్దంటి రవికుమార్, సూపర్‌వైజర్స్ దీపాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవం ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు

తాడేపల్లిరూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి–తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు బాలోత్సవ నిర్వాహకులు గాదె సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటలో తెలిపారు. ఆగస్టు 10వ తేదీ శనివారం సాయంత్రం 2 గంటల నుంచి 4 గంటలవరకు తాడేపల్లి పట్టణ పరిధిలోని అమరావతి ఐకాన్ అపార్ట్‌మెంట్ ఫంక్షన్ హాల్‌లో ఈ పోటీలు నిర్వహించనున్నామని, ఈ పోటీలలో సబ్ జూనియర్స్ (3,4,5 తరగతులు)కు అంశం జెండా వందనం, జూనియర్స్ (6,7 తరగతులు)కు మీకు ఇష్టమైన స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్స్ (8,9,10 తరగతులు)కు స్వాతంత్ర్య ఉద్యమంలో ఏదైనా ఒక ఘట్టంపై పోటీలు నిర్వహిస్తామని, ఆగస్టు 7వ తేదీలోపు పోటీలలో పాల్గొనదలచిన వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, డ్రాయింగ్ కాంపిటేషన్‌లో పాల్గొనే వారికి కేవలం డ్రాయింగ్ షీట్ మాత్రమే అందజేస్తామని మరిన్ని వివరాలకు ఆర్. నాగరాజు 9490099559 నెంబర్‌ను సంప్రదించాలని, విజేతలకు బహుమతి ప్రదానం, సర్టిఫికేట్లు అందజేస్తామని గాదె సుబ్బారెడ్డి ఆ ప్రకటనలో తెలియజేశారు.

ఐరన్ సిరప్‌తో రక్తహీనత దూరం

ఫిరంగిపురం: చిన్నారులకు ఐరన్ సిరప్ తాగించడం ద్వారా రక్తహీనతను దూరం చేయవచ్చని నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యురాలు యానీగ్రేస్ అన్నారు. మండలంలోని మేరికపూడి గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 134 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు ఐరన్ సిట్రోజ్ సిరప్ వారానికి రెండుమార్లు ఇస్తున్నదీ లేనిదీ అంగన్ వాడీ కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇస్తున్న పోషక విలువలతో కూడిన ఆహారం గురించి వివరాలను పరిశీలించారు. ఎంపీహెచ్‌ఎస్ అబ్దుల్ రెహమాన్, ఎంఎల్‌హెచ్‌పీ గంగరాజు, ఏఎన్‌ఎం పాపులమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో కూటమి దౌర్జన్యకాండ కొనసాగుతోంది

పెరికలపూడి సర్పంచ్ గంపల గంగాధర్



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ గంపల గంగాధర్, పక్కన ఉప సర్పంచ్ టి. గంగాధర్

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గంలో శాంతిభద్రతలు లోపించాయని, ప్రశ్నించిన వారిపై దౌర్జన్యం చేసి దాడులకు పాల్పడుతున్నారని లౌకికవాదులందరూ వీటిని తీవ్రంగా ఖండించాలని మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలం పెరికలపూడి గ్రామ సర్పంచ్ గంపల గంగాధర్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఉప సర్పంచ్ తాడిబోయిన గంగాధర్‌తో కలసి సమావేశం ఏర్పాటు చేశారు. సర్పంచ్ గంపల గంగాధర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి ఆ పార్టీల నేతలు ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, ఎవరైనా ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు ఏర్పాటు చేయడంతో కొంతమంది యువకులు మద్యంతాగి అనవసరమైన గొడవలు సృష్టిస్తున్నారని, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి తరువాత అధికారులు సైతం భయభ్రాంతులకు గురి అవుతున్నారని, దానికి ఉదాహరణ పెరికల పూడి గ్రామంలో గతంలో చెరువు ఆక్రమణలు తొలగించి గ్రామానికి ఉపయోగపడే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారని, ప్రస్తుతం ఆ చెరువును కొంతమంది ఆక్రమించుకున్నారని, గత 15 రోజుల క్రితం పరదాలు, పట్టాలు కట్టిన వారు ఇప్పుడు ఏకంగా ఐరన్ పైపులతో పెద్ద పెద్ద షెడ్లులు నిర్మిస్తున్నారని, అధికారులు ఆక్రమణలు తొలగించేందుకు వెనకడుగు వేస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు వెంటనే ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండించి అధికారులను బెదిరించిన వారిపై చర్యలు తీసుకుని, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని డిమాండ్ చేశారు.

కేఎల్ విద్యార్థులకు పోర్చుగల్ ఆచార్యుల బోధన



డాక్టర్ ఫిలిప్ ఫెర్నాండెజ్, డాక్టర్ మాన్యుయెల్ ఆంటోనియోలను సత్కరిస్తున్న వీసీ డాక్టర్ జి.పార్థసారథి

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీని పోర్చుగల్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కోయింబ్రా ఆచార్యులు డాక్టర్ ఫిలిప్ ఫెర్నాండెజ్, డాక్టర్ మాన్యుయెల్ ఆంటోనియోలు శనివారం సందర్శించి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. ఈ సందర్భంగా వర్సిటీ విదేశీ సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు మాట్లాడుతూ అధ్యాపకుల మార్పిడి ఒప్పందంలో భాగంగా తమ యూనివర్సిటీ విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యను అందించడంతో పాటు అంతర్జాతీయ పరిశోధనా సహకారాలను ప్రోత్సహించడానికి తాము చేస్తున్న ప్రయత్నాల్లో ఇది ఒక భాగమని అన్నారు. అనంతరం డాక్టర్ ఫిలిప్ ఫెర్నాండెజ్, డాక్టర్ మాన్యుయెల్ ఆంటోనియోలను ఘనంగా సత్కరించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి. విజయకుమార్, మొట్టమొదటి పరిశోధనా ల్యాబొరేటరీ ఇన్‌చార్జి డాక్టర్ ప్రియరంజన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి

జాతీయ బీసీ చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బీసీ రమణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ రమణ, పక్కన సంఘం నేతలు

తాడేపల్లిరూరల్: బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని జాతీయ బీసీ చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బీసీ రమణ డిమాండ్ చేశారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉండవల్లి రాజగృహ కార్యాలయంలో బీసీ చైతన్య సమితి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఓసీలకు ఇచ్చిన ప్రాధాన్యత బీసీలకు ఇవ్వలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడడానికి బీసీలు ప్రధాన పాత్ర పోషించారని, కానీ తెలుగుదేశం పార్టీ బీసీలను పక్కన పెట్టి ఓసీలకు పెద్దపీట వేసిందని విమర్శించారు. ముఖ్యమంతి, ఉపముఖ్యమంత్రి పదవులు ఓసీలకు కేటాయించి బీసీలను చిన్న చూపు చూశారని, ఇప్పటికైనా ఉప ముఖ్యమంత్రి దవిని బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జాతీయ బీసీ చైతన్య సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట నరసింహ రాజ్, తెలంగాణ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, తెలంగాణ నాయకులు నరేంద్ర, రాష్ట్ర జనసేన బీసీ నాయకులు వెంకటేశ్వర్లు, రెండు తెలుగు రాష్ట్రాల బీసీ చైతన్య సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై విస్తృత అవగాహన అవసరం



సమావేశంలో పాల్గొన్న పలు శాఖల అధికారులు

ప్రత్తిపాడు: బీసీజీ వ్యాక్సిన్‌పై గ్రామస్థాయిలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కొత్తమల్లాయపాలెం సర్పంచ్ కుందూరి లక్ష్మారెడ్డి వైద్యాధికారుల్ని కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో కె. దుర్గాప్రసాద్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. హాజరైన ఎంపీపీ దాసరి అన్నమ్మ సభ్యుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని అధికారుల్ని కోరారు. తొలుత విద్య, వైద్య, వ్యవసాయ, ఇరిగేషన్, పశు సంవర్థక, సెర్ప్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఐసీడీఎస్ శాఖల అధికారులు వారి శాఖల్లో అమలవుతున్న పథకాలు, వాటి అమలును వివరించారు. సర్పంచ్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కరోనా వ్యాక్సిన్ వేయించుకున్న కొందరు తీవ్ర అనారోగ్యం పాలై ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరలా ఇప్పుడు వ్యాక్సిన్ అంటే ప్రజలు భయపడిపోతున్నారని, దీనిపై ఆరోగ్య సిబ్బంది అపోహల్ని తొలగించాలని సూచించారు. వ్యాక్సిన్ వల్ల కలిగే ప్రయోజనాల్ని గ్రామాలకు ఆరోగ్య సిబ్బంది వచ్చి అవగాహన కల్పిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయని తెలిపారు. ఎంపీడీవో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ నిమిత్తం 24 గంటల హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మలేరియా, డెంగీ, డయేరియా వంటి సీజనల్ వ్యాధులపై ఎవ్వరైనా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు సీపీఎం శిక్షణ తరగతులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆధ్వర్యంలో మండల స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను ఆదివారం నిర్వహిస్తున్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కార్యదర్శి జెట్టి బాలరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దుగ్గిరాల ముర్తుజానగర్‌లోని షాదీఖానాలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు, పార్టీ సభ్యులు, అగ్జిలరీ సభ్యులు పాల్గొని ఈ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

పేరెంట్స్ డే శుభాకాంక్షలు
PLNM (Prabhala) Degree College
Opp. Acharya Nagarjuna University Men's Hostel, Near Kaza Toll Plaza, Mangalagiri, Guntur District. Cell : 9177408565
Join 4 yr Regularly
B.Sc (Hons) Computer Science
B.Sc (Hons) Electronics
B.Com (Hons) Computer Applications
B.A (Hons) in Economics or History
B.A (Hons) Special English
Get PG in 1 Year or one can exit after 3 years Admissions Online
Colleges offer's regular PG courses
M.Com, M.A English, M.A Social Work
Qualified SC, ST, BC, EBC get Scholarships
Join on or before 5th August & get ₹5000 Scholarship
Run by Dr. Kishore Prabhala 30 Years Expert and Dr. N. Venkata Lakshmi 25 Years Expert & B. Basavaiah 10 Years Expert

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com